# ఫూల్స్

## ప్రఫుల్లచంద్ర

శమిత, శ్యామంత్- మేడ్ ఫర్ ఈచ్ అదర్!

ఇద్దరూ కోటీశ్వరుల బిడ్డలు. ఫిగరూ, పొగరూ వున్నవాళ్ళు. కావలసినంత స్వేచ్ఛ, మొయ్యలేనన్ని నోట్లకట్టలూ వున్నవాళ్ళు. పైగా ఇద్దరికీ వివాహం నిశ్చయం అయింది. పెళ్ళి అయేలోగా టైమ్ వేస్ట్ ఎందుకని హద్దూ, అదుపూ లేకుండా సద్వినియోగం చేసుకుంటూ వుండగానే వారం రోజులు గడిచిపోయాయి.

అయితే వాళ్ళకి కాలం ఒక్కసారిగా ఆగిపోయింది. అంతా బోర్.. బోర్..

సినిమాలూ, షికార్లూ.. బోర్! జోకులూ, రాక్‌లూ ఉత్సాహాన్నివ్వడం లేదు. చుంబన ఆలింగనాలూ కిక్ ఇవ్వడం లేదు! హోటల్ సామ్రాట్ నూట పదహారోగదిలో- రాత్రి పదిగంటల వేళ- ఏం చేయాలి? ఏం చేస్తే కాలం కదిలి థ్రిల్‌గా వుంటుంది- అని బుర్రలు బద్దలుకొట్టుకొని ఆలోచించారు. మదిలో ఏదో మెరిసింది కాబోలు- చెంగున మంచం మీదనుంచి దూకి కిటికీలోంచి బయటకు చూస్తూ ''శ్యామంత్! ఇలారా! చూడు, చూడు..'' అరిచింది శమిత గాభరాగా.

శ్యామంత్ చూశాడు.

హోటల్ కాంపౌండ్ బయట తుప్పలూ, డొంకలూ- చీకటి. ఫర్లాంగు దూరంలో ఎలక్ట్రిక్ పోల్ మీద గుడ్డిగా వెలుగుతున్న బల్బు. అక్కడ కొంచెం వెలుగు. ఆ పోల్‌దాటాక లేబర్ కాలనీ- అంతా చీకటి.

''ఏముంది? అంతా చీకటి'' అన్నాడు శ్యామంత్ వెనక్కి తిరిగి.

అతనికి తగిలేట్టు వెనక నిల్చుని కిటికీలోంచి చెయ్యి బయటకు చాపి చూపిస్తూ ''అదిగో, కనిపించడం లేదా?! ఆ పోల్ వద్ద ఒక యువతి.. ఎవరో రేప్ చేస్తున్నారు.. ఆమె పెనుగులాడుతోంది. వాడు.. ఆ బట్టతల వాడు..'' అంటూ కెవ్వున అరిచింది.

''ఏమిటి? ఏమిటి?'' గాభరాగా అడిగాడు శ్యామంత్.

''హత్య! ఆ బట్టతలవాడు ఆమెను పొడిచేశాడు! చూడు, చూడు!'' అంది ఒణికిపోతూ. శ్యామంత్ బయటకు చూశాడు. ఏమీ కనిపించలేదతనికి. అయోమయంగా ఆమెవైపు చూశాడు.

ఆమె గలగలా నవ్వేస్తూ, ''ఏయ్, బుద్ధూ! అంతా ఉత్తిదే'' అంది. ఇద్దరూ పడీ పడీ నవ్వుకున్నారు.

హఠాత్తుగా నవ్వు ఆపి ''భలే థ్రిల్‌గా ఉంది కదూ! అక్కడ హత్య జరిగిందని పోలీసులకు ఫోన్ చేద్దాం. వాళ్ళొస్తారు. వెదుకుతారు. వెర్రి మొగాలేసుకొని వెళ్ళిపోతారు! మనం ఈ కిటికీలోంచి చూస్తూ నవ్వుకోవచ్చు. భలే థ్రిల్'' చిన్నపిల్లలాగ మురిసిపోతూ అంది శమిత.

ఐడియా బాగానే వుందనిపించింది శ్యామంత్‌కి. ఇద్దరూ పథకం ఆలోచించారు.

ఎలక్ట్రిక్ పోల్ వద్ద హత్య జరిగినట్టూ, ఎవరో శవాన్ని ఈడ్చుకుపోయినట్టూ కొన్ని ఆనవాళ్ళు సృష్టించాలి. తర్వాత సమస్యలు తల ఎత్తకుండా మారుపేరుతో పోలీసులకు ఫోన్ చేయాలి. పరిశోధన ఏ దిశలో సాగుతున్నదో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నవ్వుకోడానికి వీలుగా ఒకర్ని నియమించాలి. రైటో...

అప్పుడు టైమ్ పదకొండు. అంతా నిర్మానుష్యం.. నిశ్శబ్దం. అడుగులో అడుగేసుకుంటూ పోల్ వద్దకు వెళ్ళారిద్దరూ. శమిత కింద పడుకుంది. ఆమె రెండు చేతులూ పట్టుకొని కొంతదూరం బరబరా లాక్కెళ్ళాడు శ్యామంత్. హ్యాండ్ బ్యాగ్‌లోని ఎర్ర నెయిల్ పాలిష్ తీసి అక్కడక్కడ చుక్కలు పడేట్టు వేసింది శమిత- రక్తంలా కనిపించడానికి.

చుట్టూ చూసి ఎవరూ తమని గమనించడంలేదని నిర్ధారణ చేసుకొని సంతృప్తిగా హోటల్ గదిలోకి వచ్చేశారు. గొంతు మార్చి పోలీసులకు ఫోన్ చేశాడు శ్యామంత్.

తర్వాత లైటు ఆర్పేసి మంచం మీద దొర్లుతూ తమ ఘనకార్యం గురించి చర్చించుకుంటూ వుండగా.. పోలీస్ సైరన్. ఇద్దరూ చటుక్కునలేచి కిటికీవద్దకు దూకి బయటకు చూసి..

షాక్.. షాక్...

అక్కడ నిజంగా ఒక స్త్రీ శవం వుంది! పోలీసులు ఫోటోలు తీస్తున్నారు. పరిసరాల్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. లేబర్ కాలనీ నుంచి కొందర్ని తీసుకొచ్చాడొక కానిస్టేబుల్. వాళ్ళు ఇన్‌స్పెక్టర్‌తో ఏదో చెబుతున్నారు. ఇన్‌స్పెక్టర్ ఆ స్థలం అంతా గుచ్చి గుచ్చి చూస్తూ కిందపడివున్నదేదో చేతిలోకి తీసుకొని పరిశీలించి జేబులో వేసుకున్నాడు. శ్యామంత్ గుండె ఝల్లుమంది. అది తన ఉంగరం! ఇన్‌స్పెక్టర్ చుట్టూ చూస్తూ హోటల్ సామ్రాట్ మీద దృష్టి నిలిపాడు. చీకటి గదిలోవున్న తాము ఇన్‌స్పెక్టర్‌కి కనిపించే అవకాశం లేకపోయినా శమిత, శ్యామంత్‌ల గుండెల నిండా దిగులు అలముకుంది.

• • •

''ముద్దాయి శ్యామంత్ కాలేజీ రోజుల్లో పోకిరీ కుర్రాడు. ఇప్పటికీ అతనికి అమ్మాయిలతో ఎఫైర్స్ ఉన్నాయి. అమ్మాయిల్ని బెదిరించి లొంగదీసుకోవడం అతని హాబీ. ఎదురు తిరిగిన తులసిని హత్య చేశాడు. పోలీసులను తప్పుదారి పట్టించడానికి బట్టతల వ్యక్తి ఎవరో హత్య చేస్తుండగా తను చూసినట్టు ఈ ముద్దాయే హోటల్ సామ్రాట్ నుంచి ఫోన్ చేశాడు. ఒక బట్టతల వ్యక్తి హత్య చేసినట్టు లేబర్ కాలనీలో కొందరు చూశారు. బట్టతల విగ్గు శ్యామంత్ గదిలో దొరికింది. అతని ఉంగరం హత్యా స్థలంలో దొరికింది. ముద్దాయే హంతకుడని నిరూపించడానికి సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడానికి అనుమతి ఇవ్వాల్సిందిగా శ్రీ కోర్టువారిని ప్రార్థిస్తున్నాను'' అంటూ కూర్చున్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పి.పి.) రమణ.

• • •

శ్యామంత్ తండ్రి కోటేశ్వర్రావు- ప్రఖ్యాత లాయర్ చైతన్య కాళ్ళుపట్టుకోగా నిజానిజాలు తెలుసుకోడానికి చైతన్య జైలుకి వెళ్ళి శ్యామంత్‌ని కలిశాడు.

శ్యామంత్ పోకిరి కుర్రాడే. ధనమదాంధకారంతో అమ్మాయిల జీవితాలతో ఆడుకున్నవాడే. అయితే బుద్ధుడికి బోధివృక్షం కింద జ్ఞానోదయం అయినట్టు శ్యామంత్‌కి లాకప్‌లో జ్ఞానోదయం అయినట్టుంది.

''పోలీసులను ఆటపట్టించడానికే అలా ఫోన్ చేశాను. కాని నేనా హత్య చేయలేదు. అసలు చూడనేలేదు. నన్ను నమ్మండి. కొత్త జీవితం ప్రారంభించడానికి నాకొక అవకాశం ఇవ్వండి'' అంటూ బావురుమన్నాడు శ్యామంత్.

''ఆరాత్రి నీగదిలోవున్న అమ్మాయి ఎవరు?'' హఠాత్తుగా అడిగాడు చైతన్య.

''అబ్బే, ఎవరూ లేరు సార్! నేనొక్కడినే.''

''నిజాన్ని దాచిపెట్టేవాళ్ళ కేసు నేను వాదించను'' చటుక్కున లేచి వెళ్ళబోయాడు చైతన్య.

''సార్! సార్! ఆగండి! నిజం చెబుతాను. ఆ రాత్రి నాతో వున్నది నా కాబోయే భార్య. ఆమె ఐడియానే ఇదంతా. పోలీసులను ఫూల్స్ చేయబోయి మేమే ఫూల్స్ అయాం. తనపేరు బయటపడితే డాడీ చంపేస్తారని శమిత ఏడ్చింది. అందుకే ఆ హోటలు గదిలో ఒంటరిగానే వున్నానని పోలీసులకు అబద్ధం చెప్పాను.''

• • •

శ్యామంత్ తరఫున కోర్టులో వాదిస్తూ-

''యువరానర్! మన జేబులో వున్న వస్తువులన్నీ మనం పెట్టుకున్నవే కానక్కరలేదు. మనకు తెలియకుండా ఎవరైనా మన జేబులో పడవేయవచ్చు'' అని చైతన్య అంటూ వుండగానే- ''ఎవరో ఏదో మన జేబులో పడేస్తే మనకు తెలియకుండా వుండదు... మనం చవటలైతే తప్ప!'' అందుకున్నాడు పి.పి. రమణ. చూడవచ్చిన జనం ముసి ముసిగా నవ్వుతోంటే చైతన్య కూడా నవ్వేస్తూ ''సరే, తన జేబులో ఏది పడేసినా తెలుసుకోలేనివాడిని చవటగానే పరిగణిద్దాం. అభ్యంతరం లేదు. అయితే ప్రాసిక్యూటర్‌గారి జేబులోని వస్తువులన్నీ ఆయనే స్వయంగా తెచ్చుకున్నవే కదా!'' అడిగాడు.



''అందుకు సందేహమేల?'' నవ్వాడు రమణ.

''అయితే ఆయన ఏ మహత్కార్యం నెరవేర్చడానికి పట్టపగలు కోర్టులోకి నిరోధ్ ప్యాకెట్ తెచ్చుకున్నారో తెలుసుకోవాలి ఉంది యువరానర్!'' చటుక్కున అన్నాడు చైతన్య.

''వాట్ నాన్సెన్స్!'' అరుస్తూ జేబులు వెదుక్కున్న రమణ చేతికేదో తగిలింది. బయటకు తీశాడు.. అది నిరోధ్ ప్యాకెట్! ప్రేక్షకులు ఘొల్లున నవ్వుతోంటే అతని ముఖం జేవురించింది.

''నిరోధ్‌తో చేయగల పని ఒక్కటే నాకు తెలుసు. మరి ఏ మహత్కార్యం చేయడానికి ప్రాసిక్యూటర్‌గారు దాన్ని కోర్టుకు తెచ్చుకున్నారో...'' ఆగి కొంటెగా చుట్టూ చూశాడు చైతన్య. జనం విరగబడి నవ్వుతోంటే- ''ఆర్డర్! ఆర్డర్!'' అంటూ మేజిస్ట్రేట్ సుత్తిదెబ్బలు వేస్తోంటే- ''సారీ! ఇది నా జేబులోకి ఎలా వచ్చిందో నాకు తెలియదు'' అన్నాడు రమణ నీరసంగా.

''అందువల్ల మీరొక చవట'' అని కాసేపాగి ''అని చెప్పే సాహసం చేయను'' అన్నాడు చైతన్య. మళ్ళీ జనం అంతా ఘొల్లుమన్నారు. రమణ తల వాలిపోయింది.

''యువరానర్! ప్రాసిక్యూటర్‌గారి జేబులోకి నిరోధ్ ప్యాకెట్ ఎలా చేరిందో అదేవిధంగా బట్టతల విగ్గు శ్యామంత్ గదిలో చేరిందని నిరూపించబోతున్నాను. ఇక్కడొక పాయింట్ గమనించాలి యువరానర్! గుండువున్న ప్రతివాడూ మహాత్మాగాంధీ కానట్టే బట్టతల విగ్గు పెట్టుకున్న ప్రతివాడూ శ్యామంత్ కానక్కరలేదు. హోటల్ గదిలో శ్యామంత్‌తోబాటు ఒకమ్మాయి వుంది. ఆమె ఖరీదైన విదేశీ గోళ్ళరంగు వాడుతుంది. హత్యా స్థలంలో శ్యామంత్ ఉంగరంతోబాటు గోళ్ళ రంగు చిహ్నాలున్నాయి. ఆ రంగు ఖరీదైన విదేశీ కంపెనీది. ఉంగరం దొరికినందుకు శ్యామంత్‌ని అరెస్ట్ చేసిన పోలీసులు ఆ అమ్మాయినెందుకు అరెస్ట్ చేయలేదు? ఆ అమ్మాయి ఎవరు? ఆమెకూ శ్యామంత్‌కూ, ఆమెకూ హత్యకూ సంబంధం ఏమిటి?'' ప్రశ్నలు కురిపించాడు చైతన్య.

• • •

ప్రాథమిక విచారణ దశలోనే మేజిస్ట్రేట్ కేసు కొట్టివేయగా- కొడుకు విడుదల అయిన సందర్భంగా కోటేశ్వరావు ఇచ్చిన డిన్నర్ పార్టీలో పాల్గొని, ఫీజు తీసుకొని వెళ్తున్న లాయర్ చైతన్యని ఆపి- ''తన బోయ్‌ఫ్రెండ్ సాయంతో శమితయే ఈ హత్య చేయించి నామీదకు నెట్టేసిందని ఎలా కనిపెట్టారుసార్!'' కొంత ఆశ్చర్యంగా మరింత ఆరాధనగా అడిగాడు శ్యామంత్.

అదే నీకూ నాకూ తేడా అన్నట్లు చిరునవ్వు చిందించి- ''కాకి వాలగానే తాటిపండు పడి కిందనున్న నక్క చావడాన్ని కాకతాళీయం అంటాం. అలాంటి రెండు సంఘటనలు ఒకేసారి జరగడం అరుదు... అసంభవం అనే చెప్పవచ్చు'' అంటూ చైతన్య ఇంకా ఏదో చెప్పబోతుండగా- అతిథులందర్నీ పంపేసి అక్కడికొచ్చిన కోటేశ్వరావు- చైతన్య ప్రతిభను పొగడ్డం ప్రారంభించాడు.

''నిజం చెప్పాలంటే నా సర్వీస్ మొత్తంలో ఇదే చాలా ఈజీ కేసు! పోలీసులను ఆటపట్టించడానికి హత్య జరిగినట్టు ఫోన్ చేయడం వరకూ ఓ.కే. శమిత చెప్పినట్టే నిజంగా హత్య జరగడం కాకతాళీయం అనుకోవచ్చు. కానీ ఆమె బట్టతల వ్యక్తి హత్య చేశాడని చెప్పడం, కొన్ని గంటల తర్వాత నిజంగానే బట్టతల వ్యక్తి హత్య చేయడం- రెండో కాకతాళీయం! నేనిందాక చెప్పినట్టు రెండు కాకతాళీయాలు ఒకేసారి జరగడంతో అనుమానించాను. బట్టతల వ్యక్తి అని శమిత ప్రత్యేకంగా చెప్పి తప్పులో కాలేసింది. ఆమె అలా చెప్పి ఉండకపోతే హంతకుడిని పట్టుకోవడం కష్టం అయేది.'' లాయర్ వైపు దిగ్భ్రాంతిగా చూస్తూ వుండిపోయారు తండ్రీ, కొడుకూ.

చైతన్య లేచి వెళ్ళబోతూ, ఆగి- ''శ్యామంత్! నువ్వు విన్నా వినకపోయినా ఒక సలహా చెబుతాను. ఆడపిల్లల జీవితాలతో ఆడుకోకు. పోలీసులు చవటలైనట్టు సినిమాల్లో చూపిస్తే నమ్మేసి వాళ్ళని ఫూల్ చేయబోయి నువ్వే ఫూల్ అయావు. సినిమాలకూ, షికార్లకూ, హోటళ్ళకూ కలిసి తిరిగినా శమిత- నిన్ను ప్రేమించలేదనీ, బలవంతపు పెళ్ళి తప్పించుకోడానికీ, నిన్ను ఒదిలించుకోడానికీ పథకాలు వేస్తోందనీ గ్రహించలేని ఫూల్‌వి నువ్వు! మళ్ళీ ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే నిన్ను రక్షించేవాళ్ళే ఉండరు జాగ్రత్త'' అంటూ వడివడిగా బయటకు నడిచాడు. ★

